క్లుప్తంగా...

నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

ఉప్పల్: హబ్సిగూడ 11 కేవీ ఫీడర్ మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 10 గంటల నుంచి 12.30 వరకు హబ్సిగూడ మెయిన్ రోడ్డు, కాకతీయనగర్, హబ్సిగూడ వీధి నంబర్-3 నుంచి 7 వరకు కరెంటు ఉండదని ఏఈ రామిరెడ్డి తెలిపారు. 11 కేవీ హెచ్ఎంటీనగర్ ఫీడర్ మరమ్మతుల కారణంగా బుధవారం మధ్యాహ్నం 3 నుంచి 5 గంటలకు వరకు హెచ్ఎంటీనగర్ వీధి- 7 నుంచి 12 వరకు, సరస్వతినగర్, బాపూజీ నగర్ తదితర ప్రాంతాల్లో కరెంటు ఉండదని తెలిపారు.

నాచారం ఇండోర్ సబ్‌స్టేషన్ ఫీడర్ పరిధిలో..

మల్లాపూర్: నాచారం ఇండోర్ సబ్‌స్టేషన్ ఫీడర్ 11 కేవీ రాంరెడ్డినగర్ ఫీడర్ పరిధిలో ఉన్న కాలనీల్లో చెట్ల కొమ్మల కటింగ్ కోసం బుధవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు నాచారం విద్యుత్ ఏఈ నాగరాజు తెలిపారు.

ఉత్తమ వైద్య ఉద్యోగిగా ప్రకాశ్



ఉప్పల్: ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉప్పల్ పీహెచ్‌సీ సూపరింటెండెంట్ బోగ ప్రకాశ్‌కు ఉత్తమ ఎంప్లాయి అవార్డు అందుకున్నారు. అవార్డును ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, జిల్లా వైద్యాధికారి పుట్ల శ్రీనివాస్ చేతులమీదుగా అందుకున్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలి



కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో హరితహారం

మౌలాలి: హరితహారంలో భాగంగా కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో మంగళవారం పాఠశాల డైరెక్టర్ ఈ.చంద్రమౌళి విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం చెట్ల ప్రాముఖ్యతను తెలుపుతూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో జోనల్ ఇన్‌చార్జి ఎల్.బుచ్చిరెడ్డి, ప్రిన్సిపల్ వై.జాన్ సురేష్‌బాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి నిధులివ్వండి



జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రోస్‌తో ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి

హబ్సిగూడ: గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ రొనాల్డ్ రాస్‌ను మంగళవారం ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఉప్పల్ నియోజకవర్గంలో తాను పాదయాత్రలో గుర్తించిన సమస్యల పరిష్కారానికి నిధులు కేటాయించాలని కమిషనర్‌ను కోరారు.

ఓలా, ఉబర్ డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలి

రామంతాపూర్: ఓలా, ఉబర్ ట్యాక్సీ డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై మౌంట్‌ఫోర్ట్ సోషల్ ఇనిస్టిట్యూట్‌లో మంగళవారం సమావేశం నిర్వహించారు. పలువురు మాట్లాడుతూ ఓలా, ఉబర్ సంస్థలు వాహనంపై ఓనర్ మీరే అంటూ డ్రైవర్లను మోసగిస్తున్నారు. ఈ సంస్థ ఆధ్వర్యంలో నడిచే టాక్సీ డ్రైవర్లకు తమ వాహనం మెయింటెనెన్స్ ఇంధనం ఖర్చులు కమిషన్ పన్నులు అన్నీ పోనూ వారికి మిగిలేది కేవలం 20 శాతం ఆదాయం మాత్రమేనన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు డ్రైవర్లకు ఉచిత ప్రమాద బీమా, ఉపాధి హక్కులు కల్పించే సమగ్రమైన చట్టాన్ని తీసుకువచ్చి డ్రైవర్లను ఆదుకోవాలని అన్నారు. ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ వర్గీస్ టేక్‌నాథ్, నేషనల్ లా స్కూల్ ఆఫ్ ఇండియా యూనివర్సిటీ ప్రొఫెసర్ మోహన్ మణి, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ జనార్దన్, ప్రొఫెసర్లు బాబు, మాథ్యూస్, టాక్సీ డ్రైవర్ల సంఘం అధ్యక్షుడు షేక్ సలావుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

5 రోజుల క్రితం అక్రమం.. నేడు సక్రమం..



చురుగ్గా సాగుతున్న అక్రమ షెడ్ నిర్మాణం పనులు

కుషాయిగూడ: ఐదు రోజుల క్రితం అక్రమ నిర్మాణమంటూ టౌన్‌ప్లానింగ్ అధికారులు భారీ షెడ్‌ను కూల్చివేశారు. నిర్మాణదారుడు ఓ అడుగు ముందుకేసి ఏకంగా కూల్చిన గోడలను తిరిగి నిర్మించి కిటికీలను కూడా బిగించాడు. ఐదు రోజుల క్రితం అక్రమంగా ఉన్న నిర్మాణం సక్రమంగా ఎలా అయ్యిందంటూ స్థానికులు చర్చించుకుంటున్నారు. చర్లపల్లి డివిజన్ పరిధిలోని నాగార్జుననగర్ కాలనీ మెయిన్ రోడ్డులో ఓ నిర్మాణదారుడు ఎలాంటి అనుమతులు లేకుండా భారీ షెడ్ నిర్మాణం చేపట్టాడు. ఈ క్రమంలో అధికారులు పలుమార్లు నోటీసులు జారీ చేశారు. అయినా షెడ్ నిర్మాణం ఆగలేదు. షెడ్ నిర్మాణంలో అధికారుల పాత్రపై విజిలెన్స్ అధికారులు సైతం విచారణ జరిపారు. ఇంత జరిగిన షెడ్ నిర్మాణాన్ని అధికారులు అడ్డుకోలేదు. కారణమేమిటని ఆరా తీయగా అధికార పార్టీ నేతల ఒత్తిడి వల్లే అధికారులు అడుగు ముందుకు వేయలేదని తెలిసింది. అక్రమ షెడ్ నిర్మాణంపై ఫిర్యాదుల ఒత్తిడిని తట్టుకోలేక అధికారులు తప్పని పరిస్థితుల్లో కూల్చివేతలకు పాల్పడినట్లు సమాచారం. కూల్చివేతలు మొదలు కాగానే అధికార పార్టీ నేతల నుంచి టౌన్‌ప్లానింగ్ అధికారులకు వరుస ఫోన్ కాల్స్ రావడంతో తాత్కాలికంగా కూల్చివేతలు చేపట్టి వెళ్లిపోయారు. మరుసటి రోజు నుంచే నిర్మాణదారుడు యథావిధిగా నిర్మాణ పనులు మొదలు పెట్టి తన పని కానిస్తున్నా అధికారులు అటువైపు చూడటం లేదు. అధికారులకు అందాల్సిన తాయిలాలు అందాయో.. అధికార పార్టీ నేతల ఒత్తిడో తెలియదు కానీ టౌన్‌ప్లానింగ్ అధికారులు చేతులు ముడుచుకోవడంతో అక్రమ షెడ్ నిర్మాణ పనులు మాత్రం చురుగ్గా సాగుతున్నాయి.



ఐదు రోజుల క్రితం షెడ్‌ను కూల్చివేస్తున్న టౌన్‌ప్లానింగ్ సిబ్బంది

రాష్ట్ర ప్రజలకు మెరుగైన వైద్య సేవలు

రామంతాపూర్: మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్‌లో ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా మంగళవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా వైద్యా ఆరోగ్య శాఖ అధికారులు ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉప్పల్ ఎమ్మెల్యే భేతి సుభాష్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం తొమ్మిది సంవత్సరాలుగా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో అన్ని రాష్ట్రాల కంటే ముందంజలో ఉందన్నారు. అనంతరం ఆయన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా వైద్యశాఖలో విశిష్ట సేవలు అందించిన వైద్య సిబ్బందికి ప్రశంస పత్రాలు, జ్ఞాపికలను అందించారు. జిల్లా వైద్యాధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్, డిప్యూటీ అధికారి డాక్టర్ నారాయణరావు, ఆనంద్, ఆఫీసర్లు రంగనాథ స్వామి, మంజుల, సంధ్యారాణి, సరస్వతి, శేషు, పద్మ, అంజయ్య, డాక్టర్లు సౌందర్య లత, రమాదేవి, మంజుల, సూపర్ వైజర్ బోగ ప్రకాష్, టెక్నీషియన్లు పాల్గొన్నారు.



వైద్య సిబ్బందికి జ్ఞాపిక అందజేస్తున్న ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి

ఘనంగా ఇంజినీర్స్ డే



ఉప్పల్ సర్కిల్ కార్యాలయంలో ఇంజినీర్స్ డే జరుపుకుంటున్న సర్కిల్ సిబ్బంది

ఉప్పల్: ఉప్పల్ జీహెచ్ఎంసీ సర్కిల్ కార్యాలయంలో మంగళవారం తెలంగాణ ఇంజినీర్స్ డేను జరుపుకున్నారు. ముఖ్య అతిథిగా డీసీ అరుణకుమారి పాల్గొని హైదరాబాద్ మొట్టమొదటి ఇంజినీర్ అలీ నవాజ్ జంగ్ బహదూర్ జన్మదినోత్సవాన్ని జరుపుకున్నారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఈఈ నాగేందర్, డీఈ నిఖిల్‌రెడ్డి, నాగమణి, ఏఈ రాజ్‌కుమార్, సాయికిరణ్, జ్యోతి, ప్రాజెక్టు అధికారి రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

బోడుప్పల్: ప్రభుత్వం ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని 23వ డివిజన్ కార్పొరేటర్ రాసాల వెంకటేశ్‌యాదవ్ అన్నారు. 15వ డివిజన్‌లో వాసులకు సీఎం రిలీఫ్ కింద మంజూరైన చెక్కులను మంగళవారం ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్.రాణికి రూ.42.5 వేల చెక్కు, నిర్మలా రాణికి రూ.10 వేలు చెక్కు, కాలఏసు సూర్యకు రూ.15 వేల చెక్కులు మంజూరైనట్లు వెల్లడించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో పడతం లోకేష్, పోతుల మల్లేష్, కొండ రామచందర్, నాగయ్యపల్లి మల్లేష్, ఊరటి మహేష్, నవీన్, జోసెఫ్, అమృతయ్య, శ్రీకాంత్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



సీఎం రిలీఫ్ చెక్కు అందజేస్తున్న కార్పొరేటర్ వెంకటేశ్‌యాదవ్

అల్వాల్‌లో కాంగ్రెస్ దిష్టిబొమ్మ దహనం



కాంగ్రెస్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

అల్వాల్: నరేంద్ర మోదీ కేసీఆర్‌ను అవినీతి నుంచి కాపాడుతున్నాడని అల్వాల్‌లో అనుచిత పోస్టర్లు వెలిశాయి. కోట్లాది మంది అభిమాన నాయకుడైన ప్రధాని నరేంద్ర మోదీని కించపరుస్తూ బీజేపీ కార్యకర్తల మనోభావాలు దెబ్బతీసేలా చేసిన దోషులను వెంటనే కఠినంగా శిక్షించాలన్నారు. అనంతరం అల్వాల్‌లోని మీ సేవ సెంటర్‌లో కాంగ్రెస్ దిష్టిబొమ్మను దహనం చేసి ర్యాలీగా అల్వాల్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు.

అత్యవసర పనులను త్వరగా చేపడతాం

– క్షేత్రస్థాయిలో కమిషనర్ పర్యటన



వివరాలను అడిగి తెలుసుకుంటున్న కమిషనర్ వేణుగోపాల్‌రెడ్డి

బోడుప్పల్: బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలోని క్షేత్రస్థాయిలో మంగళవారం కమిషనర్ వేణుగోపాల్‌రెడ్డి పర్యటించారు. పర్యటనలో భాగంగా తొలుత ప్రధాన రహదారులను పరిశీలించారు. అనంతరం చెత్త డంపింగ్ యార్డు, కంపోస్టు యార్డు, డీఆర్‌సీ సెంటర్‌ను పరిశీలించారు. రోడ్ల స్థితిగతులు, వాటి నిర్వహణ ఏవిధంగా చేపట్టాలి తదితర విషయాలపై అధికారులతో చర్చించారు. రోడు మరమ్మతులపై త్వరలో చర్యలు తీసుకుంటామన్నారు. చెత్త డంపింగ్ నిర్వహణపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అత్యవసర పనులను త్వరగా చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు. అధికారులు, పాలకవర్గ సభ్యులతో కలిసి సమస్యల పరిష్కారం కోసం కృషి చేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ జాన్‌పాల్‌రెడ్డి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆటో యూనియన్ బోర్డు ఆవిష్కరణ

రామంతాపూర్: డివిజన్ పరిధిలో శారదానగర్ ఏడీఆర్ఎం వీధిలో మంగళవారం మాజీ కార్పొరేటర్ గంధం జ్యోత్స్న నాగేశ్వర్‌రావు ఆటో రిక్షా యూనియన్ల బోర్డును ఆవిష్కరించారు. ఆటో యూనియన్ ప్రెసిడెంట్ విజయ్‌కుమార్‌తో పాటు చింతపల్లి ప్రశాంత్, అశోక్, వెంకటయ్య, జాంగీర్, శెట్టి తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు ఇబ్బంది లేకుండా చూస్తాం

మల్కాజిగిరి: బాలసరస్వతీనగర్‌లోని నల్ల పోచమ్మ దేవాలయం వద్ద రూ.4 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను స్థానిక కార్పొరేటర్ శ్రవణ్ పరిశీలించారు. వచ్చే ఆది, సోమవారాలు బోనాల జాతరలోపు పనులు పూర్తవుతాయని, భక్తులకు ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. కార్యక్రమంలో ప్రవీణ్, కుమార్, లక్ష్మణ్, బాలక్రిష్ణ, శంకర్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

నీటి సమస్యల నివారణకు చర్యలు

గౌతంనగర్: డివిజన్‌లో నీటి సమస్య నివారణకు చర్యలు తీసుకుంటున్నామని స్థానిక కార్పొరేటర్ మేకల సునీత రాముయాదవ్ అన్నారు. మంగళవారం డివిజన్ పరిధిలోని బీహారి బస్తీలో పవర్ బోరు పనులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మల్కాజిగిరి ఎమ్మెల్యే సహకారంతో బీహారిబస్తీ, ఇందిరానెహ్రూనగర్ ప్రజల కోరిక మేరకు పవర్‌బోరు వేయించామన్నారు. కార్యక్రమంలో అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



బీహారిబస్తీలో పవర్‌బోరు పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ మేకల సునీతరాముయాదవ్

కిరణ్ స్కూల్ వద్ద తల్లిదండ్రుల ధర్నా



ధర్నా చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

బోడుప్పల్: కిరణ్ స్కూల్ యాజమాన్యం మొండి వైఖరిని నిరసిస్తూ ఆ పాఠశాల ఎదుట మంగళవారం విద్యార్థుల తల్లిదండ్రులు ధర్నా నిర్వహించారు. విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ కిరణ్ స్కూల్‌లో మా పిల్లలకు అడ్మిషన్ తీసుకున్నామని, అక్కడ చదువు చెప్పకుండా పక్కనే అక్రమంగా నిర్మించిన భవనంలో చెబుతున్నారన్నారు. ఆ భవనం ఇరుగ్గా ఉందని, ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మించారన్నారు. వేలాది రూపాయల ఫీజులు తీసుకుంటున్న యాజమాన్యం విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకోకుండా వారి ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తున్నారన్నారు. మెయిన్ స్కూల్‌లో చేర్పిస్తే ఎందుకు ఇరుకు భవనంలోకి మారుస్తున్నారని యాజమాన్యాన్ని ప్రశ్నిస్తే నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారన్నారు.

జేఏసీ మల్లాపూర్ కన్వీనర్‌గా సురేందర్



మల్లాపూర్: తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ కన్వీనర్‌గా మల్లాపూర్ డివిజన్ దుర్గానగర్‌కు చెందిన బైరపాక సురేందర్ నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం జేఏసీ చైర్మన్ నల్లా రాధాకృష్ణ నియామక ఉత్తర్వులను అందజేశారు. నల్లా రాధకృష్ణ మాట్లాడుతూ నియోజకవర్గంలోని 10 డివిజన్లలో పూర్తిస్థాయి కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కసుకుంట్ల విజయ్‌కుమార్, సాయికుమార్, నరేష్‌గౌడ్, గుర్రాల మల్లేష్ ఉన్నారు.

సమస్యలన్నింటికీ త్వరలో పరిష్కారం

– ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి

కాప్రా: తన నియోజకవర్గంలో పలుచోట్ల కొన్ని సమస్యలు ఉన్న మాట వాస్తవం, వాటిని అతి త్వరలోనే పరిష్కరిస్తామన్నారు ఉప్పల్ ఎమ్మెల్యే భేతి సుభాష్ రెడ్డి. నమస్తే ఉప్పల్ కార్యక్రమంలో భాగంగా నేరుగా ప్రజల వద్దకే వెళ్లి సమస్యలు తెలుసుకునేందుకు మీకోసం.. మీ ఎమ్మెల్యే పేరుతో పాదయాత్ర చేపట్టినట్లు ఆయన తెలిపారు. ఇందులో భాగంగా మంగళవారం కాప్రా డివిజన్‌లోని సాయిబాబానగర్, సాయిరాంనగర్, ఇందిరానగర్ కాలనీల్లో పాదయాత్ర ద్వారా ప్రతి కాలనీలో ప్రతి మనిషిని పలకరిస్తూ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి మాట్లాడుతూ.. పాదయాత్ర ద్వారా ప్రజల నుంచి స్పందన వస్తుందన్నారు. గతంలో ఈ ప్రాంతంలో ఇళ్ల ముందు డ్రమ్ములు పెట్టుకుని నీటి కోసం ఎదురుచూసే వాళ్లని.. ఇప్పుడు ఆ పరిస్థితి లేకుండా మిషన్ భగీరథ ద్వారా ప్రతి ఇంటికీ నల్లా నీరు అందిస్తున్నామన్నారు. కొన్నిచోట్ల నీటి సరఫరాలో ప్రెషర్ సమస్య ఉందనే విషయం తన దృష్టికి వచ్చిందని, తక్షణమే సమస్య పరిష్కరించే విధంగా అధికారులను ఆదేశించినట్లు పేర్కొన్నారు. ఇంకొన్ని చోట్ల వీధి దీపాలు, డ్రైనేజీ రోడ్ల సమస్యలు అక్కడక్కడా నెలకొన్నాయని వాటిని వారం, పది రోజుల్లో పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. వార్డు కార్యాలయాల ద్వారా ఉప్పల్ నియోజకవర్గంలో ఇప్పటి వరకు 1,036 దరఖాస్తులు వచ్చాయని, వాటిలో 900లకుపైగా దరఖాస్తులు పరిష్కారం అయ్యాయని పేర్కొన్నారు. ప్రతి నిత్యం ప్రజలకు అందుబాటులోనే ఉంటానని, సేవ చేసే అవకాశం ప్రజలు కల్పించాలని ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి కోరారు. కాప్రా డివిజన్ కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి, బీఆర్ఎస్ నాయకులు ఎం.కె. బద్రోద్దీన్, కాసం మహిపాల్‌రెడ్డి, సూడుగు మహేందర్‌రెడ్డి, గిల్బర్ట్, సుశీల్ తదితరులు పాల్గొన్నారు.



కాప్రా డివిజన్‌లో ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి పాదయాత్ర

కాంగ్రెస్ గెలిస్తేనే సంక్షేమ పాలన

అల్వాల్: రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించాలని కాంగ్రెస్ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు నందికంటి శ్రీధర్ అన్నారు. మంగళవారం అల్వాల్ సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో పాదయాత్ర చేపట్టారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే సంక్షేమ పరిపాలన అందిస్తామన్నారు. కాంగ్రెస్ నాయకులు తదితరులు ఉన్నారు.



మధ్యాహ్న భోజన పథకం కార్మికుల నిరసన

మల్కాజిగిరి: మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మల్కాజిగిరి మండల విద్యాధికారి కార్యాలయం వద్ద కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. సీఐటీయూ అనుబంధంగా ఉన్న సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సీఐటీయూ మల్కాజిగిరి మండల కార్యదర్శి నర్సింగరావు మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి పదేళ్లవుతున్నా కార్మికుల సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. అసెంబ్లీ సాక్షిగా ముఖ్యమంత్రి కార్మికుల వేతనం పెంచుతామని చెప్పినా అమలు కాలేదన్నారు. కార్మికులకు ఉద్యోగ భద్రతతో పాటు, ఈఎస్ఐ పీఎఫ్ అమలయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి కృపాసాగర్, నాయకులు సుమిత్ర, సువర్ణ, షాహీన్, నాగేశ్వరి, కాంచన, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.



మండల విద్యాధికారి కార్యాలయం వద్ద నిరసన

ఆపదలో ఉన్నవారికి అండగా ఉంటా



ఆటోడ్రైవర్ నాగరాజుకు ఆర్థిక సాయం అందజేస్తున్న బండారి లక్ష్మారెడ్డి

కుషాయిగూడ: ఆపదలో ఉన్నవారికి అండగా ఉంటానని బీఎల్ఆర్ ట్రస్టు చైర్మన్, బీఆర్ఎస్ సీనియర్ నేత బండారి లక్ష్మారెడ్డి అన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న చర్లపల్లి, ఈసీనగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ నాగరాజును మంగళవారం ఆయన పరామర్శించి వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదరికంతో ఉన్నత చదువులకు దూరమవుతున్న విద్యార్థులకు ఆర్థిక చేయూత అందించి ప్రోత్సహించడంతో పాటు నియోజకవర్గ వ్యాప్తంగా అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. సామాజిక సేవాభావనతోనే ఆపదలో ఉన్న పేదలకు చేయూత అందిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆటో వ్యాన్ డ్రైవర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నబి, ఉపాధ్యక్షుడు సారయ్యయాదవ్, సతీష్‌గౌడ్, నేమూరి మహేష్‌గౌడ్, అశ్విన్‌రాజ్, బాలుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిపై పీడీయాక్ట్

– రూ.8 లక్షల సొత్తు రికవరీ

మేడిపల్లి: చోరీలకు అలవాటు పడిన వ్యక్తిపై పీడీ యాక్టు అమలు చేసిన ఘటన మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. మేడిపల్లి సీఐ గోవర్ధనగిరి తెలిపిన వివరాల ప్రకారం రాచకొండ కమిషనరేట్ మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో రాత్రి సమయాల్లో చోరీలు చేస్తున్న ఓ వ్యక్తిని మేడిపల్లి క్రైమ్ టీం అదుపులోకి తీసుకొని విచారించగా మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన రాత్లావత్ శంకర్ నాయక్ కుటుంబాన్ని వదిలేసి చెడు వ్యసనాలకు బానిసై 2012వ సంవత్సరం నుంచి దొంగతనాలు చేస్తున్నాడు. రాష్ట్రంలో 50 వరకు చోరీలు చేశాడు. వివిధ పోలీస్ స్టేషన్‌లో కేసులు కూడా నమోదయ్యాయి. ఇటీవల మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో మూడు కేసులు నమోదయ్యాయి. దీంతో అతడి వద్ద నుంచి రూ.8 లక్షల విలువ చేసే నగలు, నగదు స్వాధీనం చేసుకొని సీజ్ చేశారు. రాచకొండ సీపీ ఆదేశాల మేరకు పీడీయాక్ట్ నమోదు చేసి అతడిని చెర్లపల్లి జైలుకు తరలించినట్లు మేడిపల్లి సీఐ గోవర్ధనగిరి తెలిపారు.



శంకర్ నాయక్

ఎలక్షన్ల కోసమే ఎమ్మెల్యే పాదయాత్ర



సమావేశంలో మాట్లాడుతున్న రాగిడి లక్ష్మారెడ్డి, కాంగ్రెస్ నేతలు

కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రాగిడి లక్ష్మారెడ్డి

ఉప్పల్: నాలుగున్నర ఏళ్లుగా సమస్యలను పట్టించుకోని ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి ఎలక్షన్లు వస్తున్నాయని తెలియగానే డివిజన్లలో పాదయాత్ర ప్రారంభించారని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రాగిడి లక్ష్మారెడ్డి విమర్శించారు. ఉప్పల్ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నాయకులు రాజ్యలక్ష్మీ, బూర్గుల రమేష్, వినోద్ ముదిరాజ్, బొట్టు రాజేష్‌తో కలిసి మాట్లాడారు. కాంగ్రెస్ పాలనలో ఏమి చేసిందని అనడం విడ్డూరంగా ఉందన్నారు. చిలుకానగర్‌ను అభివృద్ధి చేసింది కాంగ్రెస్ పార్టీ అని గుర్తించుకోవాలన్నారు. నాటి నుంచి నేటి వరకు ఇళ్లు లేని నిరుపేదలకు పట్టాలు ఇచ్చి పేదవారిని ఆదుకుందని, పూర్తిగా స్లమ్‌గా ఉన్న చిలుకానగర్‌ను చక్కగా తీర్చిదిద్దిన ఘనత కాంగ్రెస్‌కే దక్కిందన్నారు. ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని గుర్తు చేశారు. బీఆర్ఎస్ పాలనలో ప్రజలకు మిగిలింది మురుగు, తవ్వి వదిలేసిన రోడ్లు మాత్రమేనని ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగున్నర ఏళ్లుగా చిలుకానగర్ డివిజన్‌కు ఎమ్మెల్యే చేసింది ఏమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. పనులు చేస్తే చేతులెత్తి మొక్కుతామని, కానీ ఎన్నికల ముందు వచ్చినా ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు. సొంత డబ్బా కొట్టుకుంటే సరిపోదని సమస్యలను పట్టించుకోవాలని సూచించారు. ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అవుతుంటూ ఊరుకున్నారే తప్ప చేసింది ఏమీ లేదన్నారు.